# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JANUARY - 2002

# సంక్షిప్త వార్తలు

2001 నవంబరు 14 నుండి 16 వరకు సోదరులు జాషువా గూటం గారు సతీ సమేతముగా ఢిల్లీ వెళ్లి అక్కడ సంఘమును దర్శించిరి. వారితో వారి రెండవ కుమారుడు సామ్యుల్ రోనీ గారు కూడ ఢిల్లీ వెళ్లి క్షేమముగా గృహమునకు 18వ తేదీ నాడు చేరుకొనిరి.

డిశంబరు 2వ తేదీ ఆదివారం ఉదయం మద్రాసులో కొట్టూరు - అడయార్‌లో యున్న క్రీస్తు సంఘ ఆరాధనలో సోదరులు జాషువా గూటం గారు పాల్గొని వాక్యపరిచర్యచేసిరి. వారి ప్రసంగమును స్థానిక సువార్తికులు కె. మల్లిక్ గారు తమిళము లోనికి అనువదించిరి. మద్రాసు మహానగరం లో సోదరులు మల్లిక్ గారు క్రీస్తు కొరకు కష్టించి పని చేయుచున్నారు.

డిశంబరు 2వ తేదీ రాత్రి సోదరులు జాషువా గారు, వారి కుమారుడు సామ్యుల్ రోనీ గారు బయలుదేరి సింగపూర్‌కు చేరుకొనిరి. అక్కడ 3వ తేదీ నుండి 6వ తేదీ వరకు జరిగిన ఏషియన్ బైబిల్ లెక్చర్‌షిప్ లో పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. భారత దేశములో జరుగుచున్న పనిని గూర్చి అక్కడ వారికి వివరించిరి. పది దేశముల నుండి సువార్తికులు, సభ్యులు ఆ లెక్చర్‌షిప్‌లో పాల్గొనిరి. డిశంబరు 8వ తేదీ నాటికి సోదరులు కాకినాడలో స్వగృహమునకు క్షేమముగా చేరుకొనిరి.

డిశంబరు 14వ తేదీ శుక్రవారం సామర్లకోట మండలం మావిళ్లదొడ్డి (వెంకట కృష్ణ రాయపురం) గ్రామములో సువార్తికుల సదస్సు జరిగెను. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి పలు సువార్తికులు ఆ సదస్సుకు హాజరైరి. ఆనాడు "ఆరాధనలో ప్రార్థన యొక్క పాత్ర" అను అంశము చర్చించబడెను. మావిళ్లదొడ్డిలో సోదరులు గొడుగు యోనా గారు చాల కాలము నుండి సువార్త పనిచేయుచు మంచి సంఘమును ఏర్పాటు చేయగల్గిరి. యోనా గారు సోదరులు టి.వి.యన్. కుమార్ గారి పర్యవేక్షణలో చక్కటి పనిని చేయుచున్నారు.

సదస్సుకు సోదరులు జాషువా గూటం గారు అధ్యక్షత వహించగా సోదరులు యమ్. సూర్యారావ్ (ఫక్రుద్దీన్‌పాలెం), యు. స్టాలిన్ (గుత్తినదీవి), టి.వి.యన్. కుమార్ (కాకినాడ), ఇ.కె.వి. ప్రసాదరావ్ (చెయ్యేరు), నేటీ

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 363722

Editor :

JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 22 జనవరి 2002 సంచిక 6


# యేసుక్రీస్తు దేవుని కుమారుడు - 2

## (Jesus Christ, the son of God - 2)

యేసు ప్రభువు మున్నెన్నడు ఎవడు జన్మించని రీతిగా ఒక కన్యక గర్భమున పుట్టెను. తన జనన విధానమును బట్టి దేవుని కుమారుడని, నిరూపించుకొనెనని గత సంచికలో మనం నేర్చుకొన్నాము. ఆయన అట్లు జన్మిస్తారని 700 సం॥లకు ముందే దేవుడు తన ప్రవక్తద్వారా ప్రజలకు తెలియజేసెను. "కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును. ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరుపెట్టును" అని యెషయా ప్రవచించెను (యెషయా 7:14). ఇమ్మానుయేలను పదమునకు

భాషాంతరమున దేవుడు మనకు తోడని యర్థము. యెషయా ప్రవచించిన రీతిగనే కన్యయైన మరియ గర్భవతియై కుమారుని కనెను. ఆ కుమారుడు మనతో యున్నప్పుడు దేవుడే మనతో యుండెను. ఆయనే యేసుక్రీస్తు.

బాలుడైన "యేసు జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయ యందును, మనుష్యుల దయయందును వర్థిల్లుచుండెను" (లూకా 2:52). ఆ దినముల యందు బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి - పరలోక రాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడని యూదయ అరణ్యములో ప్రకటించు చుండెను. ఆ సమయమున యెరూషలేము వారును యూదయ వారందరును యొర్దాను నదీ ప్రాంతముల వారందరును అతని యొద్దకు వచ్చి తమ పాపములు ఒప్పుకొనుచు, యొర్దానులో అతనిచేత బాప్తిస్మము పొందుచుండిరి" (మత్తయి 3:1-7).

"ఆ సమయమున యోహానుచేత బాప్తిస్మము పొందుటకు యేసు గలిలయ నుండి యొర్దాను దగ్గరనున్న అతని యొద్దకు వచ్చెను. అందుకు యోహాను - నేను నీచేత బాప్తిస్మము పొందవలసిన వాడనైయుండగా నీవు నా యొద్దకు వచ్చుచున్నావా ? అని ఆయనను నివారింపజూచెను గాని - యేసు ఇప్పటికి కానిమ్ము; నీతియావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తరమిచ్చెను గనుక అతడాలాగు కానిచ్చెను. యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్లలో నుండి ఒడ్డునకు వచ్చెను; ఇదిగో ఆకాశము తెరువబడెను. దేవుని ఆత్మ పావురమువలె దిగి తనమీదికి వచ్చుట చూచెను. మరియు ఇదిగో ఈయనే నా ప్రియకుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను" (మత్తయి 3:13-17). " యేసు బోధింపనారంభించినప్పుడు ఆయన దాదాపు ముప్పది ఏండ్లవాడు" (లూకా 3:23).

# తండ్రియైన దేవుని సాక్ష్యము

యేసుప్రభువు తనలో పాపమేమియు లేకపోయినను యొర్దానులో యోహానుచే బాప్తిస్మము పొందెను. నీతియావత్తు నెరవేర్చుటకు ఆయన బాప్తిస్మము పొందెను. అయితే కుమారుడైన క్రీస్తు దేవుని ఆజ్ఞకు ఇట్లులోబడగా పరిశుద్ధాత్మ దేవుడు పావురమువలె ఆయన మీదికిదిగెను, తండ్రియైన దేవుడు ఆకాశము నుండి తన స్వరమునెత్తి "ఈయనే నా ప్రియకుమారుడు; ఈయన యందు నేనానందించుచున్నాను" అని పలికి లోకమునకంతటికి క్రీస్తును పరిచయము చేసెను. ఈయనే నా ప్రియకుమారుడని తండ్రియైన దేవుడు సాక్ష్యమిచ్చెను. గనుక తండ్రి యిచ్చిన సాక్ష్యమునుబట్టి యేసుక్రీస్తు దేవుని కుమారుడని మనము తప్పక విశ్వసించాలి.

మరికొన్ని దినములైన తరువాత యేసు తన శిష్యులగు "పేతురును, యాకోబును అతని సహోదరుడైన యోహానును వెంటబెట్టుకొని యెత్తయిన యొక కొండమీదికి ఏకాంతముగా పోయి వారియెదుట రూపాంతరము పొందెను. ఆయన ముఖము సూర్యునివలె ప్రకాశించెను; ఆయన వస్త్రములు వెలుగువలె తెల్లనివాయెను. ఇదిగో మోషేయు, ఏలియాయు వారికి కనబడి ఆయనతో మాటలాడుచుండిరి. అప్పుడు పేతురు ప్రభువా, మనమిక్కడ ఉండుట మంచిది; నీకిష్టమైతే ఇక్కడ నీకొకటియు, మోషేకు ఒకటియు, ఏలియాకు ఒకటియు మూడు పర్ణశాలలు కట్టుదునని యేసుతో చెప్పెను. అతడు ఇంకను మాటలాడుచుండగా ఇదిగో ప్రకాశమానమైన యొక మేఘము వారిని కమ్ముకొనెను; ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడని యొక శబ్దము ఆ మేఘములో నుండి పుట్టెను" (మత్తయి 17:1-5).

యేసుప్రభువు రూపాంతరము పొందిన ఈ సందర్భములో మరి యొక్క

మారు తండ్రియైన దేవుడు ఆకాశమునుండి తన స్వరమును వినిపించి యేసు ఆయన యొక్క ప్రియకుమారుడని సాక్ష్యమిచ్చెను. అంతేకాదు ఇక మీదట ప్రజలు మోషేను, ప్రవక్తలనుగాక (అంటే పాతనిబంధనను గాక) తన కుమారుడైన క్రీస్తును, ఆయన మాటలను (అనగా క్రొత్తనిబంధనను) వినవలెనని హెచ్చరించెను. నిశ్చయముగా తండ్రియైన దేవుడు కుమారుడైన దేవునిగూర్చి యిచ్చిన సాక్ష్యమును మనము నమ్మవచ్చునుగదా. అందుకే "నేను ఆయనననని మీరు విశ్వసింపని యెడల మీ పాపములలోనే చనిపోవుదురని" యేసు బోధించెను.

యేసు ప్రభువు చనిపోయిన లాజరును బేతనియలో బ్రదికించెను. అటు తరువాత పస్కాపండుగ సందర్భములో యెరూషలేములో ప్రవేశించెను. బహు జన సమూహములు ఖర్జూరపు మట్టలు పట్టుకొని ఆయనను ఎదుర్కొనబోయి - జయము ప్రభువుపేరట వచ్చుచున్న ఇశ్రాయేలు రాజు స్తుతింపబడునుగాక అని కేకలు వేయుచు ఆయనకు స్వాగతము పలికిరి. ఆ పండుగలో ఆరాధింప వచ్చిన వారిలో కొందరు గ్రీసు దేశస్థులుండిరి. వారు యేసును చూడగోరి ఆయన యొద్దకు తేబడగా, యేసు "ఒకడు నన్ను సేవించిన యెడల నన్ను వెంబడింపవలెను; అప్పుడు నేను ఎక్కడ ఉందునో అక్కడ నా సేవకుడును ఉండును; ఒకడు నన్ను సేవించినయెడల నా తండ్రి అతని ఘనపరచును ... తండ్రీ నీ నామము ఘనపరచుము అని చెప్పెను. అంతట నేను దానిని మహిమ పరచితిని, మరల మహిమపరతును అను యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను. కాబట్టి అక్కడ నిలుచుండి వినిన జనసమూహము - ఉరిమెను అనిరి. మరికొందరు దేవదూత ఒకడు ఆయనతో మాటలాడెననిరి. అందుకు యేసు ఈ శబ్దము నాకొరకు రాలేదు, మీ కొరకేవచ్చెను ... నేను భూమిమీద నుండి పైకెత్తబడిన యెడల అందరిని నా యొద్దకు ఆకర్షించు కొందునని చెప్పెను" (యోహాను 12:20-32).

ఇక్కడ మూడవసారి తండ్రియైన దేవుడు ఆకాశము నుండి తన

కుమారుని గూర్చి సాక్ష్యమిచ్చుట మనము గమనించుచున్నాము. నిశ్చయముగా తండ్రి యిచ్చిన సాక్ష్యమును బట్టి యేసు ఎవరో మనము అంగీకరించవలసి యున్నదిగదా. ఆయన దేవుని కుమారుడు. అందుకే "అద్వితీయ సత్య దేవుడవైన నిన్నును నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము" అని యేసుప్రభువు పలికారు (యోహాను 17:3).

## తనను గూర్చి తానిచ్చిన సాక్ష్యము

యేసుప్రభువు తాను దేవుని కుమారుడనని బోధించుకొనినందు వలన కొందరు యూదులు ఆయనతో తర్కములాడుచుండిరి. ఆయనను చంపజూచు చుండిరి. యోహాను సువార్త 8వ అధ్యాయమంతయును యూదులకు యేసుకు మధ్య జరిగిన వాగ్వివాదముతో నిండియున్నది. యేసు వారితో, "నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగుకలిగి యుండునని వారితో చెప్పెను. కాబట్టి పరిసయ్యులు - నిన్ను గూర్చి నీవే సాక్ష్యము చెప్పకొనుచున్నావు; నీ సాక్ష్యము సత్యము కాదని ఆయనతో అనగా యేసు - నేను ఎక్కడనుండి వచ్చితినో యెక్కడికి వెళ్లుదునో నేనెరు గుదును గనుక నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పకొనినను నా సాక్ష్యము సత్యమే. నేను ఒక్కడనై యుండక నేనును నన్ను పంపిన తండ్రియు కూడనున్నాము గనుక నేను తీర్పు తీర్చినను, నా తీర్పు సత్యమే. నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పకొనువాడను, నన్ను పంపిన తండ్రియు నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాడని చెప్పెను ... అప్పుడాయన మీరు క్రిందివారు, నేను పై నుండువాడను; మీరు ఈ లోకసంబంధులు, నేను ఈ లోకసంబంధుడను కాను. కాగా మీ పాపము లలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని వారితో చెప్పెను. కాబట్టి వారు - నీవెవరవని ఆయననడుగగా యేసు వారితో - మొదట నుండి నేను మీతో ఎవడనని చెప్పచుంటినో వాడనే...నేను

(తండ్రియైన దేవుని) యొద్ద వినిన సంగతులే లోకమునకు బోధించుచున్నానని చెప్పెను" (యోహాను సువార్త 8వ అధ్యాయము దయచేసి చదువండి).

"ఒకప్పుడు పరిసయ్యులు కూడియుండగా యేసు వారిని చూచి క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది ? ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు దావీదు కుమారుడని చెప్పిరి, అందుకాయన - అలాగైతే నేను నీ శత్రువులను నీ పాదముల క్రింద ఉంచువరకు నీవు నా కుడిపార్శ్వమున కూర్చుండుమని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను అని దావీదు ఆయనను ప్రభువని ఆత్మ వలన ఏల చెప్పుచున్నాడు ? దావీదు ఆయనను ప్రభువని చెప్పినయెడల, ఆయన ఏలాగు అతనికి కుమారుడగునని వారినడుగగా ఎవడును మారుమాట చెప్ప లేకపోయెను" (మత్తయి 22:41-45).

## యితరుల సాక్ష్యము

యేసు యొక్క శిష్యులు ఆయన నిజముగా దేవుని కుమారుడని చెప్పి ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 14:33). "సీమోను, పేతురు - ప్రభువా యెవని యొద్దకు వెళ్లుదుము ? నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు; నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగి యున్నామని ఆయనతో చెప్పెను" (యోహాను 6:69). మనుష్యులను పట్టి పీడించుచున్న దయ్యములు సయితము ఆయనను దేవుని కుమారుడని ఒప్పుకొనిరి. "వారు - ఇదిగో దేవుని కుమారుడా, నీతో మాకేమి? కాలము రాకమునుపే మమ్మును బాధించుటకు వచ్చితివా?" అనికేకలు వేసిరి (మత్తయి 8:29). చివరకు సాతానుడు సయితము ఆయనను శోధించుచు, నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమనెను (మత్తయి 4:3).

యేసు సిలువ మీద వ్రేలాడుచు తన ప్రాణము విడిచెను. అప్పుడు

దేవాలయపు తెరపైనుండి క్రిందివరకు రెండుగా చినిగెను, భూమివణకెను, బండలు బద్దలాయెను, సమాధులు తెరవబడెను. శతాధిపతియు అతనితో సిలువ యొద్దకావలియున్న వారును భూకంపమును జరిగిన కార్యములన్నిటిని చూచి మిక్కిలి భయపడి - నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి (మత్తయి 27:54).

తండ్రియైన దేవుడిచ్చిన సాక్ష్యమునుబట్టి, క్రీస్తు తననుగూర్చి తానిచ్చిన సాక్ష్యమునుబట్టి, క్రీస్తు యొక్క మిత్రులు, శత్రువులు, చివరకు ఆయనను సిలువ వేసినవారి ప్రత్యక్ష సాక్ష్యమును బట్టి ఆయన దేవుని కుమారుడని మనము నమ్మకతప్పదు. ఆయనను నమ్మకపోతే నరకము తప్పదు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనొల్లని వానికి శిక్షవిధించబడునని" యేసు ప్రభువే చెప్పారు. నీవు దేనినెంచుకొంటావు ? రక్షణనా ? లేక శిక్షనా ?

❀❀❀❀❀

# ఇది నిజమా ?

## (Is it True ?)

ఇదొక ప్రాముఖ్యాంశము, గనుక దీనిని మీరు గమనించగోర్తాను. తండ్రియైన దేవునికి యేసుప్రభువు ప్రార్థిస్తూ "నీ వాక్యమే సత్యమని" చెప్పారు (యోహాను 17:17). "సత్యము మిమ్ములను స్వతంత్రులనుగా చేయునని" కూడా ఆయన చెప్పారు (యోహాను 8:31). దేవుని గూర్చియు, క్రీస్తును గూర్చియు, పరిశుద్ధాత్మని గూర్చియు, మానవుని రక్షణను గూర్చియునైన సత్యమును గూర్చి యేసు ప్రభువు అట్లు పలికారు. ఆయన వ్యవసాయం, వ్యాపారం మొదలగు వాటిని గూర్చి మాటలాడలేదు.

సత్యం స్వయం విరుద్ధముకాదు. సత్యము ఏకైకమైనది, ఖచ్చితమైనది. సత్యం మార్పును ఎన్నడు సహించదు. సత్యం విషయములో ఏ ప్రశ్నకు రెండు సమాధానములుండవు. సత్యము విషయంలో రాజీపడితే పాపము. సగం సత్యం ప్రమాదకరం.

ఇప్పుడు కొన్ని ప్రశ్నలడుగుదాం. దేవుడు లేడనునది నిజమా ? దేవుడు లేడని కొందరను కొనుచున్నారనునది నిజమా యని నేనడుగలేదు. కొందరట్లు చెబుతారు. అది నాకు తెలుసు. అయితే దేవుడు లేడనునది నిజమా ? హెబ్రీ పత్రిక లేఖకుడిట్లు చెప్పాడు ; "దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడని నమ్మవలెను" (హెబ్రీ 11:6), దీన్నిబట్టి మనం దేవునియందు విశ్వాసముంచుట అత్యవసరం. "నా విమోచకుడు సజీవుడనియు ఆయన భూమిమీద నిలుచు ననియు నేనెరుగుదునని" యోబు చెప్పాడు (యోబు 19:25). నేను ఊహించు చున్నానని యోబు చెప్పలేదు, గాని నేనెరుగుదునన్నాడు (2 తిమో 1:2). "అతిశయించువాడు దేనిని బట్టి అతిశయింపవలెననగా, భూమి మీద కృప చూపుచు నీతిన్యాయములు జరిగించుచున్న యెహోవాను నేనేయని గ్రహించి నన్ను పరిశీలనగా తెలసికొనుటను బట్టియే అతిశయింపవలెనని" యిర్మియా 9:24లో దేవుడు చెప్పారు. "నేను నమ్మిన వానిని ఎరుగుదును గనుక సిగ్గుపడను; నేను ఆయనకు అప్పగించిన దానిని రాబోవుచున్న ఆ దినము వరకు ఆయన కాపాడగలడని రూఢిగా నమ్ముకొనుచున్నాను" అని అపొ.పౌలు చెప్పాడు (2 తిమో 1:12). "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు" అని కీర్తనలు 14:1 చెప్పుచున్నది. అందువలన సత్యవాక్యమైన దైవవాక్కును బట్టి దేవుడున్నాడు !

మానవుని దేవుడు సృజించలేదుగాని పరిణామ క్రమమునుబట్టి మానవుడు ఉద్భవించాడని కొందరు నిర్దేవులు తలస్తారు. ఇది నిజమా ? దేవుని వాక్యమైన బైబిలు దీనిని బోధించుచున్నదా ? ఆది.కా. 2:7లో, "దేవుడైన యెహోవా

నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మాయెను" అని చెప్పబడియున్నది. "నీ చేతులు నన్ను నిర్మించినాకు రూపు ఏర్పరచెను" అని కీర్తనలు 119:73లో వ్రాయబడియున్నది. "నీవు నన్ను కలుగ జేసిన విధము చూడగా నాకు భయమును ఆశ్చర్యమును పుట్టుచున్నవి" యని కీర్తన 139:14 చెప్పుచున్నది. "యెహోవాయే దేవుడని తెలిసికొనుడి; ఆయనే మనలను పుట్టించెను, మనము ఆయన వారము" (కీర్తన 100:3). దేవుడు మానవుని సృజించుటయేగాక, ఆయన అతనికి జ్ఞానమును వివేకమును అనుగ్రహించి నిత్యము జీవించు ఆత్మననుగ్రహించెను (మార్కు 8:36).

మానవుని ఆత్మను రక్షించుటకు దేవుడు తన వాక్యమును కూడ అనుగ్రహించెను. "లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" (యాకోబు 1:21). సత్యవాక్యమైన దేవుని వాక్యము మానవుల ఆత్మలకు అత్యవుసరము.

దేవుని వాక్యము లేకుండగనే మానవులు రక్షింపబడగలరని కొందరు చెబుతారు. అది నిజమా ? దేవుని రాజ్యము యొక్క విత్తనము దేవుని వాక్యమని చెప్పబడింది (లూకా 8:11). దేవుని వాక్యము విత్తబడని చోట క్రైస్తవులుండరు. దేవుని వాక్యము లేకుండగనే మానవులు రక్షింపబడుట సాధ్యమైతే దానిని బోధించే బోధకులుండుట అనవుసరం; బోధించడంమానివేస్తే ప్రజలు క్రైస్తవులవుతారు ! అయితే అట్లు తలంచడం బుద్ధిహీనతయే. వాక్యోపదేశము జరుగకుండగనే మానవులు క్రైస్తవులుగా మారగలిగితే, సువార్తికులు ఖండాంతర యానములు చేసి ప్రయాసపడవలసిన పని యేమున్నది ? అయితే రోమాలో యున్నవారికి కూడా సువార్త అవురమని పౌలుకు తెలుసు (రోమా 1:16). సువార్తను ప్రకటించుము అని అతడు తిమోతిని హెచ్చరించాడు (2 తిమో 4:2). పెంతెకొస్తు నాడు పేతురు ప్రకటించిన సువార్త వాక్యము ద్వారా ఇంచు మించు మూడువేల

మంది క్రైస్తవులుగామారారు (అపొ.కా. 2:41). అట్టి వారిని ప్రభువు తన సంఘముతో చేర్చుకొన్నారు (అపొ.కా 2:47). యిది నిజము !

-- జాన్ హేంస్

❀❀❀❀❀

# పరిశుద్ధ గ్రంథ పఠనము
## (Bible Study)

మన జీవమునకు, భక్తికి కావలసిన సంపూర్ణ నియమము లేఖనముల యందు భద్రపరచబడి యున్నది. దైవావేశము వలన కలిగిన పరిశుద్ధ లేఖనాలే దేవుని మాటలు. సత్యమును గ్రహించుటకు, అబద్ద బోధలను ఎదుర్కొనుటకు, రక్షణ సంకల్పాన్ని లోకానికి అందించుట కొరకు, సంఘ క్షేమాభివృద్ధి కొరకు బైబిలును చదివి అందలి ఆజ్ఞలను మనం అనుసరించ వలసి యున్నది.

బైబిలు చదువుట మరియు ధ్యానించుటలో ఉన్న ఆశీర్వాదాలు పాత నిబంధనలో సహితం చదువగలం. ఎవరైతే యెహోవా ధర్మశాస్త్రమును దివారాత్రులు ధ్యానించుదురో వారు నీటికాలువల యోరను నాటబడినదై, తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుందురని, వారు చేయునదంతయు సఫల మగునని కీర్త 1:2-3 నందు వ్రాయబడింది. మనకు కార్యసిద్ధి కలుగునట్లు దేవుని వాక్యమును ధ్యానించాలని దీని భావము.

యేసుక్రీస్తు "తన వాడుక చొప్పున విశ్రాంతి దినమందు సమాజ మందిరము లోనికి వెళ్లి చదువుటకై నిలుచుండగా, ప్రవక్తయైన యెషయా గ్రంథము ఆయనచేతికివ్వబడెను" (లూకా 4:16).

బెరయవారు ఘనులై యుండుటకు కారణమేమంటే వారు ఆసక్తితో ప్రతి దినము లేఖనములను పరిశోధించిరి. పౌలు, సీలలు దైవజనులని వారు ఎరిగియున్నను వారు చెప్పిన సంగతులు అలాగున్నవో లేవో యని ప్రతి దినము లేఖనములను పరిశోధించిరి (అ.కా. 17:11). బోధించేవారి నిజాయితీ, వ్యక్తిత్వమునుబట్టి గాక లేఖనములతో వారి బోధలను సరిచూచుట ఘనమైన విషయము.

ఎఫె 5:25 నందు పౌలు వ్రాసిన మాటలో సందర్భసహితమైన చక్కని సందేశమున్నది. "వాక్యముతో ఉదక స్నానము చేత దానిని పవిత్రపరచి పరిశుద్ధ పరచుటకై". వాక్యపఠనము, వాక్యధ్యానము, వాక్యప్రకటన ద్వారా సంఘము పవిత్ర పరచబడి, పరిశుద్ధ పరచబడి మహిమ గల సంఘమౌతుంది. అందుకే ఆయన "దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెను".

"క్రీస్తు మర్మము దేవదర్శనము వలన నాకు తెలియపరచబడినదను సంగతిని గూర్చి మునుపు సంక్షేపముగా వ్రాసితిని. మీరు దానిని చదివిన యెడల దానినిబట్టి ఆ క్రీస్తు మర్మమును గూర్చి నాకు కలిగిన జ్ఞానము గ్రహించు కొనగలరు" (ఎఫె 3:3-4).

జె.సి. బెయిలీ వంటి ప్రియ యోధులు వారి చివరి క్షణం వరకు పరిశుద్ధ గ్రంథం పఠించారు. ఎన్నిసార్లు ఈ గ్రంథాన్ని పఠించినా, ఎన్ని సంవత్సరాలు చదివినా ఏదో ఒక నూతన భావం మనసుకు స్ఫురిస్తూనే ఉంటుంది. ఎందు కంటే అది పరిశుద్ధా ప్రేరణవలన కలిగినది.

పరిశుద్ధ గ్రంధపఠనమునకు ప్రాముఖ్యము లేదని భావించి, స్వంత సాక్ష్యాలతో, నిరర్ధకతత్వ జ్ఞానంతో, ముసలమ్మ ముచ్చటలతో కొందరు కాలాన్ని వృధా చేస్తూ ఉంటారు. "సమయము సమీపించినది గనుక ఈ ప్రవచన వాక్యములు చదువువాడును, వాటిని విని యిందులో వ్రాయబడిన సంగతులు గైకొను వారును ధన్యులు" (ప్రక 1:3). పరిశుద్ధ గ్రంధాన్ని చదువుచు, ధ్యానించుచు విధేయులమై క్రీస్తు నందలి సకలైశ్వర్యము పొందుదాం.

"ఇప్పుడు దేవునికిని, ఆయన కృపా వాక్యమునకును మిమ్మును అప్పగించు చున్నాను. ఆయన మీకు క్షేమాభివృద్ధి కలుగజేయుటకును, పరిశుద్ధ పరచ బడిన వారందరిలో స్వాస్థ్యమునసుగ్రహించుటకును శక్తిమంతుడు" (అ.కా. 20:32).

-- ఇ.కె.వి. ప్రసాదరావు
చెయ్యేరు

❀❀❀❀❀

# పాపుల మిత్రుడు
## (A Friend of Sinners)

యేసు ఏ పాపము చేయకపోయినా, పాపముతో నిండియున్న లోకంలో జీవించారు. ఆయన జననము మొదలుకొని సిలువపై మరణము వరకు ఆయన జీవితమంతయు పాపముకై వెచ్చించెను. ఆయన పెదవుల నుండి పాపపు మాట ఒక్కటియైనను రాలేదు. పాపపుపని ఆయన యేమీ చేయలేదు.

పాపపు తలంపులు ఆయన ఎన్నడు ఆలోచించలేదు. ఆయన పవిత్రుడు, నిర్దోషి, నిష్కల్మషుడు, పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడు (హెబ్రీ 9:25-26). తన జీవితంలో పాపమును నిరూపించుమని తనకాలము నాటివారిని ఆయన సవాలు చేసెను (యోహాను 8:46). వారు కనుగొనలేకపోయారు. ఆయన ఏ పాపమును చేయలేదు (1 పేతురు 2:21). ఏ పాపమును ఎరుగడు (2 కొరింథీ 5:21). ఆయనలో పాపము ఏమియులేదు (1 యోహాను 3:5). అయినను పాపియొక్క మంచి మిత్రుడాయనే. ఎందువలన ? దిగువ సంగతులు గమనించగోర్తాను.

మొదటిగా, యేసుక్రీస్తు అతిక్రమము చేయువారిలో లెక్కింపబడెను గనుక ఆయన పాపుల మిత్రుడు. ఆయన "అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెను. అనేకుల పాపమును భరించుచు తిరుగుబాటు చేసినవారిని గూర్చి విజ్ఞాపనము చేసెను" అని యెషయా ప్రవచించెను (యెషయా 53:12). అతిక్రమము చేయువారిలో ఎంచబడుట యనగా పాపము చేయువారితో ఎంచబడుటయే, ఏలయనగా ఆజ్ఞాతిక్రమమే పాపము (1 యోహాను 3:4). సుంకరియైన మత్తయిని అపొస్తలునిగా యుండుటకు యేసు పిలిచెను. మత్తయి ఆయన పిలుపు నంగీకరించి తనయింటిలో గొప్ప విందు నేర్పాటుచేసెను. అది సుంకరులతో నిండియుండెను. తనతో భోజనము నకతడు యేసును ఆహ్వానించెను. దాని నాయన అంగీకరించెను. అప్పుడు శాస్త్రులును పరిసయ్యులును అదిచూచి, "సుంకరులతోను పాపులతోను మీరేల తిని త్రాగుచున్నారని ఆయన శిష్యులమీద సణగిరి" (లూకా 5:27-30). "అందుకు యేసు - రోగులకే గాని ఆరోగ్యము గలవారికి వైద్యుడక్కరలేదు. మారుమనస్సు పొందుటకై నేను పాపులను పిలువ వచ్చితినిగాని నీతిమంతులను పిలువరాలేదని వారితో చెప్పెను" (లూకా 5:31-32). అవును, క్రీస్తు ఈ లోకములో యుండగా పాపులతో కలిసిమెలిసి తిరిగెను.

లూకా 7:36-39లో పరిసయ్యుడొకడు యేసును భోజనమునకు ఆహ్వానించిన సందర్భమును చూడగలము. ఆయన భోజనపంక్తిని కూర్చుండగా పాపాత్మురాలైన యొక స్త్రీ ఒక బుడ్డిలో అత్తరు తీసికొనివచ్చి వెనుకతట్టు ఆయన పాదముల యొద్ద నిలబడి యేడ్చుచు కన్నీళ్లతో ఆయన పాదములు తడిపి, తన తల వెంట్రుకలతో తుడిచి, ఆయన పాదములను ముద్దు పెట్టుకొని ఆ అత్తరు వాటికి పూసెను. ఆయనను పిలిచిన పరిసయ్యుడు అది చూచి - ఈయన ప్రవక్తయైన యెడల తన్ను ముట్టుకొనిన స్త్రీ ఎవతియో, ఎటువంటిదో యెరిగి యుండును; యిది పాపాత్మురాలు అని తనలో తాననుకొనెను. అవును యేసు పాపులతో కలసిమెలిసెను. అతిక్రమము చేయువారిలో ఎంచబడిన వాడాయెను.

"ఒకప్పుడు సమస్తమైన సుంకరులును పాపులును ఆయన బోధవినుటకు ఆయన దగ్గరకు వచ్చుచుండగా, పరిసయ్యులును శాస్త్రులును అదిచూచి - ఇతడు పాపులను చేర్చుకొని వారితో కూడ భోజనము చేయుచున్నాడని చాల సణుగుకొనిరి" యని లూకా 15:1-2లో వ్రాయబడియున్నది. "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని" యేసు చెప్పెను (లూకా 19:10). అందువలననే ఆయన పాపుల మధ్య ఎల్లప్పుడు యుండెను. ఆయన ఇద్దరు దొంగల మధ్య సిలువ వేయబడెను. పాపులలో ఒకనిగా సిలువ వేయబడెను. వారిద్దరిలో ఒకనితో, "నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను" (లూకా 23:39-43).

యేసు ప్రభువు ఎవరితో సహవాసము చేసారో, అట్టివారితో స్నేహం చేయుటకు మనం ఇష్టపడము. మన కాలమునాటి పాపులను మనం నిర్లక్ష్యం చేస్తే ఈ లోకానికి సువార్త ఎట్లు ప్రకటించగలము ? మనం మనవారితోనే సహవాసం చేయ గోర్తాము. అందువలన సంఘము క్షీణించుచున్నది. సంఘమునకు వెలుపల యున్నవారికి, లోకస్థులకు సువార్త బోధించాలి. క్రైస్తవులను చేయాలి.

రెండవదిగా, పాపుల పాపములను తీసివేయుటకు యేసుక్రీస్తు సిలువపై

మరణించెను గనుక ఆయన పాపుల మిత్రుడు. "నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను, మన వ్యసనములను వహించెను. అయినను మొత్తబడినవానిగాను దేవుని వలన బాధింపబడినవానిగాను శ్రమనొందిన వానిగాను మనమతనిని ఎంచితిమి. మన యతిక్రమక్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మనదోషములను బట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనమందరము గొర్రెలవలె త్రోవతప్పిపోతిమి. మనలో ప్రతివాడు తనకిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మనయందరి దోషమును అతని మీద మోపెను" (యెషయా 53:4-6). "మనము పాపముల విషయమై చనిపోయి నీతివిషయమై జీవించునట్లు ఆయన తానే తన శరీరమందు మన పాపములన మ్రానుమీద మోసికొనెను" అని పేతురు చెప్పెను (1 పేతురు 2:24). "లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిబొందెను" అని పౌలు చెప్పెను (1 కొరింథీ 15:3). పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనని కూడ అతడు చెప్పెను (1 తిమో 1:15). పాపమును, అపవిత్రతను పరిహరించుటకై తీయబడు ఊటను గూర్చి జెకర్యా 13:1లో చెప్పబడినది. "ఇమ్మానుయేలు రక్తము ఇంపైనయూటగు, ఓ పాపి యందు మున్గుము పాపంబుపోవును" అనే పాట మనందరం పాడుచుందుము. ఎంత నిజమో ! పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు తన రక్తమును చిందించెను (మత్త 26:28). నిజముగా, యేసుక్రీస్తు లోకపాపములను మోసికొనుపోవు దేవుని గొర్రెపిల్లయే !

మూడవదిగా, అతిక్రమము చేయువారిని గూర్చి ఆయన విజ్ఞాపనము చేయును గనుక క్రీస్తు పాపుల మిత్రుడైయున్నాడు (యెషయా 53:12). "ఈయన తన ద్వారా దేవుని యొద్దకు వచ్చువారి పక్షమున, విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడై యున్నాడు" (హెబ్రీ 7:25). మనం పాపము చేసినప్పుడు దేవునికిని మనకును మధ్యవర్తి ఒకరున్నారు. ఆయన క్రీస్తు యేసను

నరుడు (1 తిమో 2:5). మనం పాపము చేసినప్పుడు మారుమనస్సు పొంది దేవుని క్షమాపణ నడిగిన యెడల మనలను గూర్చి యేసుక్రీస్తు దేవుని దగ్గర విజ్ఞాపనము చేయును. "ఎవడైనను పాపము చేసిన యెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు" (1 యోహాను 1:21). "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగిన వాడును నీతిమంతుడును గుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:9).

"సహోదరుని కంటెను ఎక్కువగా హత్తియుండు స్నేహితుడు కలడు" అని సొలొమోను చెప్పెను (సామెతలు 18:24). సొలొమోను చెప్పిన స్నేహితుడు యేసుక్రీస్తే ! దయగల మన యేసు ఎంతో గొప్పమిత్రుడు ! తన స్నేహితుల కొరకు తన ప్రాణమును పెట్టువాని కంటె ఎక్కువైన ప్రేమగల వాడెవడును లేడు. నేను మీకాజ్ఞాపించువాటిని చేసినయెడల మీరు నా స్నేహితులై యుందురు" అని యేసు చెప్పెను (యోహాను 15:13-14). యేసు పాపుల మిత్రుడు ! పాపులు ఆయన మిత్రులుగా యుండగోరుదురు.

నీవాయన చిత్తమును జరిగించిన యెడల యేసు యొక్క మిత్రుడవు కాగలవు. తనకు విధేయులైన వారందరికీ ఆయన నిత్యరక్షణకు కారకుడు (హెబ్రీ 5:8-10). మనం ఆయన యందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించుచున్నారు (యోహాను 8:24; లూకా 13:3; మార్కు 16:16). రక్షింపబడి మరణ పర్యంతము నమ్మకముగా యున్న యెడల మనం ఆయనకు మిత్రులుముగా యుండగలము (ప్రకటన 2:10).

— జాన్ స్టేసీ

❀❀❀❀❀

# యేసు చేసిన బోధనలు - 2

## ( Jesus and His Teachings - 2 )

"క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగుజాడల యందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచి పోయెను" అని అపొ. పేతురు వ్రాసెను (1 పేతురు 2:21). యేసుక్రీస్తు బాల్యదశనుండి యౌవనప్రాయముగల వానిగా ఎట్లు పెరిగెనో, ఆయన ఎట్టి మాదిరి జీవితమును మనకిచ్చి పోయెనో గతవారము గమనించితిమి. గొప్ప మహిమా ప్రభావములుగల ఆయన జీవిత బోధనలలోని మరికొన్ని సత్యములను ఈ వ్యాసములో గమనింతము.

యేసు దేవుని గొర్రెపిల్లయని యోహాను ప్రకటించగా విని యోహాను శిష్యులలో ఇద్దరు యేసును వెంబడించిరి. యేసు వెనుకకు తిరిగి, వారు తన్ను వెంబడించుట చూచి - మీరేమి వెదకుచున్నారని వారి నడుగగా వారు - రబ్బీ, నీవు ఎక్కడ కాపురమున్నావు ? అని ఆయన నడిగిరి. వచ్చి చూడుడని ఆయన వారితో చెప్పగా వారు వెళ్లి, ఆయన కాపురమున్న స్థలముచూచి, ఆ దినమున ఆయన యొద్ద బసచేసిరి (యోహాను 1:35-39). మనుష్యులు ఆయన యందు ఆసక్తిని కనబరచగా యేసు వారిని చేర్చుకొనుటయేగాక ఆయన వారి కాతిధ్యమిచ్చెను. ఆ యిద్దరిలో ఒకడగు అంద్రెయ తన సహోదరుడైన సీమోనుకు మేము మెస్సీయను కనుగొంటిమని తెలియజేసి అతనిని యేసునొద్దకు తోడకొని వచ్చెను. యేసు ఏర్పరచుకొనిన 12గురు అపొస్తలులలో వీరిద్దరున్నట్లు మనము గ్రహించుకొనగలము.

### ఆయనను వెంబడించాలి

యేసు తన కొరకు శిష్యుల నేర్పరచుకొనుచు "నన్ను వెంబడించుడి" యని వారిని పిలుచుచుండెను. నన్ను వెంబడించుడియనుటలో ఆయన

మాదిరి ననుకరించుమడి యను భావము ఇమిడియున్నది. యేసు యొక్క జీవితములో గొప్ప శక్తియున్నది. ఆయనను వెంబడించువాడు ఆ శక్తిని పొందగలుగును. యేసు సువార్తయే ఆత్మలను రక్షించుటకు దేవుని గొప్ప శక్తియై యున్నది (రోమా 1:16).

యేసు ఫిలిప్పు అనునతని కనుగొని నన్ను వెంబడించుమని అతనితో చెప్పెను (యోహాను 1:43). ఫిలిప్పు నతనయేలనుమరొకని తోడుకొని వచ్చెను. యేసు సుంకపు మెట్టునొద్ద కూర్చుండి యున్న మత్తయి అను ఒక మనుష్యుని చూచి - నన్ను వెంబడించుమని అతనితో చెప్పగా అతడు లేచి ఆయనను వెంబడించెను (మత్తయి 9:9). ఒకనాడు శాస్త్రి ఒకడు వచ్చి బోధకుడా, నీ వెక్కడికి వెళ్లినను నీవెంట వచ్చెదనని ఆయనతో చెప్పెను. అందుకు యేసు - నక్కలకు బొరియలును ఆకాశ పక్షులకు నివాసములును కలవు గాని మనుష్య కుమారునికి తలవాల్చుకొనుటకైనను స్థలములేదని అతనితో చెప్పెను. శిష్యులలో మరియొకడు ప్రభువా, నేను మొదట వెళ్లి, నా తండ్రిని పాతిపెట్టుటకు నాకు సెలవిమ్మని ఆయనను అడుగగా యేసు అతని చూచి - నన్ను వెంబడించుము; మృతులు తమ మృతులను పాతిపెట్టుకొననిమ్మని చెప్పెను (మత్తయి 8:18-22). ఈ రెండు సందర్భములలోను యేసును వెంబడింప గోరినవారు ఇహలోక సుఖములను కోరరాదనియు తలిదండ్రులకంటె ఆయనను మన జీవితములో ఎక్కువ ప్రతిష్ఠించు కొనవలెననియు యేసు బోధించుచున్నట్లు మనము గ్రహించగలము.

## ఉపేక్షించుకోవాలి

గొప్ప ఆసక్తిగల యౌవనస్థుడొకడు యేసు యొద్దకు వచ్చి నిత్య జీవములో ప్రవేశించుటకు నాకు ఇకను కొదువ ఏమని ఆయనను అడిగెను. అందు కాయన నీవు పరిపూర్ణుడవగుటకు కోరిన యెడల, పోయి నీ ఆస్తిని అమ్మి బీదల

కిమ్ము, అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించుమని అతనితో చెప్పెను. అయితే ఆ యౌవనుడు మిగుల ఆస్తిగలవాడు గనుక ఆ మాటవిని వ్యసనపడుచు వెళ్లిపోయెను. (మత్త 19:16-22).

యేసును వెంబడించుట యనగా అహంను పరిత్యజించి, త్యాగజీవమును జీవించుటయని యేసుక్రీస్తు బోధించెను. "ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్నుతాను ఉపేక్షించుకొని, తన సిలువ నెత్తికొని నన్ను వెంబడింపవలెను" అని ఆయన చెప్పెను (మత్తయి 16:24). తన సిలువ నెత్తికొని ఆయనను వెంబడించు మనుటలో క్రీస్తు యొక్క శిష్యుడు కాగోరువాడు శోధనలు, కష్టములు సహింపగోరువాడై యుండవలెనని ఆయన బోధించెను. క్రీస్తుకొరకు తమ్మును తాము ఉపేక్షించుకొనిన వారికి ఆయన యిచ్చే బహుమానము చాల గొప్పది. ఆయన యిట్లనుచున్నాడు : "నా నిమిత్తమును, సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ములనైనను అక్క చెల్లెండ్రనైనను తల్లిదండ్రులనైనను భూములనైనను విడిచినవాడు ఇప్పుడు ఇహమందు హింసలతో పాటు నూరంతలుగా ఇండ్లను అన్నదమ్ములను అక్క చెల్లెండ్రను తల్లులను పిల్లలను భూములను రాబోవు లోకమందు నిత్యజీవమును నిశ్చయముగా పొందుదురు" (మార్కు 10:28-30).

## ప్రజల యొద్దకు వెళ్లాలి

యేసు రాత్రనక పగలనక ప్రజలకు బోధించుచుండెను. ఆయన సమయమును పోనీయక ఒక పట్టణమునుండి మరొక పట్టణమునకు వెళ్లుచు సువార్తను బోధించెను. సువార్త నిమిత్తము మనుష్యులు ఆయన దగ్గరకు వచ్చుట కంటే ఆయనే వారి యొద్దకు వెళ్లెను. "యేసు వారి సమాజ మందిరములలో బోధించుచు, రాజ్య సువార్త ప్రకటించుచు, ప్రతి విధమైన రోగమును ప్రతివిధమైన వ్యాధిని స్వస్థపర్చుచు, సమస్త పట్టణముల యందును గ్రామముల యందును

సంచారము చేసెను" అని మత్తయి 9:35లో వ్రాయబడియున్నది. నేటి సువార్తికులు యేసు ప్రభువు నుండి నేర్చుకొనవలసినది ఎంతో యున్నది. ప్రభువైతే ప్రజల యొద్దకు వెళ్లి బోధించెను గాని మన సువార్తికులయితే ప్రజలే తమ యొద్దకు రావలెనని కోరుచున్నారు. అట్టివారు ప్రభువునకు యదార్థమైన సేవ చేయువారు కారు. వారు ప్రభువుకంటె తమ సుఖమునే ఎక్కువ ప్రేమించిన వారగుదురు.

మతమును వ్యాపారముగా మార్చువారిని యేసు ప్రభువు ఖండించెను. "యూదుల పస్కా పండుగ సమీపింపగా యేసు యెరూషలేమునకు వెళ్లి దేవాలయములో ఎడ్లను గొర్రెలను పావురములను అమ్మువారును రూకలు మార్చు వారును కూర్చుండుట చూచి త్రాళ్లతో కొరడాలు చేసి గొర్రెలను, ఎడ్లనన్నిటిని దేవాలయము నుండి తోలివేసి, రూకలు మార్చువారి రూకలు చల్లివేసి, వారి బల్లలు పడద్రోసి పావురములు అమ్మువారితో - వీటిని ఇక్కడ నుండి తీసికొని పొండి; నా తండ్రి యిల్లు వ్యాపారపు ఇల్లుగా చేయకూడదని చెప్పెను" (యోహాను 2:13-17). క్రైస్తవ మతమును వ్యాపారముగా మార్చువారు మన మధ్య లేక పోలేదు. అట్టివారు ఈ సంఘటన నుండి గొప్ప పాఠమును నేర్చుకొన వలసి యున్నది.

## తిరిగి జన్మించాలి

దేవుని రాజ్యములో ప్రవేశించవలెనన్న ఒకడు తిరిగి జన్మించవలెనని యేసు బోధించెను. ఈ తిరిగి జన్మించుట యనునది శారీరకముగా కాదు గాని ఆత్మీయముగా జరుగవలెను. ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని యేసు బోధించెను. అందుకు నీకొదేము అను పరిసయ్యుడు ముసలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు ? రెండవమారు తల్లిగర్భమందు ప్రవేశించి జన్మింపగలడా అని ఆయనను అడుగగా యేసు - ఒకడు

నీటిమూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యము లో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను (యోహాను 3:3-5). యేసు బోధించిన ఈ క్రొత్త జన్మ బాప్తిస్మమును సూచించుచున్నది. ఒకడు వాక్యమును బట్టి నీటిలో ముంచబడి నప్పుడు క్రొత్త జన్మనొందిన వాడగును. ఇంకొక మాటలో ఆత్మయొక్క మాటల ద్వారా బాప్తిస్మము పొందిన వాడు దేవుని రాజ్యములో ప్రవేశించునని యేసు బోధించెను.

యేసు నందు విశ్వాసముంచు వాడు నశింపడుగాని నిత్యజీవమును పొందునని యేసు బోధించెను. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. ఆయన అద్వితీయ కుమారుడైన క్రీస్తునందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే దేవుడాయనను పంపించెను. గనుక ఎవరయినను నశించుచున్న యెడల వారు తమకు తామే బాధ్యులుగాని క్రీస్తు కాడు. విశ్వసింపనివాడు దేవుని అద్వితీయ కుమారుని నామమందు విశ్వాస ముంచలేదు గనుక వానికి ఇంతకు ముందే తీర్పు తీర్చబడెను.

ఆ తీర్పుఇదే. వెలుగు లోకములోనికి వచ్చెను. గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి. దుష్కార్యములు చేయు ప్రతివాడును వెలుగును ద్వేషించును, తన క్రియలు దుష్క్రియలుగా కనబడకుండునట్లు వెలుగు నొద్దకు రాడు. సత్యవర్తనుడైతే తన క్రియలు దేవుని మూలముగా చేయబడి యున్నవని ప్రత్యక్ష పరచబడునట్లు వెలుగు నొద్దకు వచ్చును అని యేసు బోధించెను (యోహాను 3:16-21).

ఈ లోకములోనికి వచ్చిన వెలుగు యేసుక్రీస్తు. పాపపు చీకటిని పారద్రోలుటకు ఆయన వచ్చెను. ఆయనను అంగీకరించిన వారి జీవితములో

నుండి చీకటిని పారద్రోలుటకు ఆయన ఇప్పటికిని శక్తి కలిగి యున్నాడు. నీవు యేసు నందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది క్రీస్తు నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొనుచు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అప్పటి నుండి ఆయన వెలుగులో నీవును, నీలో ఆయన వెలుగును కలిగి జీవించుము, నిత్య జీవిత మార్గమదియే !

-- జాషువా గూటం.

❀❀❀❀❀

# నిజమైన ఆరాధన హృదయములో నుండి వచ్చును

## ( True Worship is from the Heart )

దేవుని యెడల నీకు గల ప్రేమానుబంధములను క్రియారూపముగ వ్యక్త పరచునదియే ఆరాధన. ఆరాధించవలెననెడి నిశ్చయత హృదయమందు కలుగనిచో అసలు దేవుని ఆరాధించుటయే జరుగదు. "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు. గాని వారి హృదయము నాకు దూరముగా యున్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు". అని మత్తయి 15:8-9 లో ప్రభువైన యేసు చెప్పెను.

దేవుని యెడల మనకు గల ప్రేమను, భక్తిని యెట్లు నిరూపించగలము? మనము దేవుని స్తుతించుచు పాడు పాటల ద్వారాను, ఇచ్చుట ద్వారాను, ప్రార్థించుట ద్వారాను, సహవాసములో పాలిభాగస్థుల మగుట ద్వారాను, వినయ భయభక్తులతో బోధింపబడుచున్న వాక్యమును ధ్యానించుట ద్వారాను ఆ ప్రేమను ప్రత్యక్షపరచగలము.

### ఈ దిగువ చెప్పబడిన కొన్ని వాక్యములను గమనించుదము :

1. ఒకనినొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధ మైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు, కీర్తించుడి (ఎఫెసి 5:19).

2. నీవు యౌవ్వనేచ్ఛల నుండి పారిపొమ్ము. పవిత్ర హృదయులై ప్రభువునకు ప్రార్థన చేయువారితో కూడ నీతిని, విశ్వాసమును, ప్రేమను, సమాధానమును వెంటాడుము (2 తిమోతి 2:22).

3. సణుగు కొనకయు, బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగ ఇచ్చు వానిని ప్రేమించును (2 కొరింథీ 9:7).

4. ఆయన రొట్టెను విరిచి - ఇది మీ కొరకైన నా శరీరము. నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను (1 కొరింథీ 11:24). మనము యెచ్చట జ్ఞాపకము చేసి కొందుము ?

5. నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణ ఆత్మతోను, నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెనను నదియే ప్రధానము (మత్త 22:37).

పాటల యొక్క భావము, మన పాపములకు పొందిన ప్రాయశ్చిత్తము, వాక్యములో గల అమూల్యము లైనట్టి వాగ్దానములు - వీటన్నిటిని గూర్చి నీ హృదయా లోచనలేమై యున్నవి? ఈ ఆరాధన ద్వారా నేను యేమీ పొందలేదని చెప్పెదవా? ఆరాధనకు మూలము, ముఖ్యమునైనది హృదయమేగాని, ఈ లోకసంగతులుకావు.

నీవు ఆరాధించు ఆలయము ఎంత పెద్ద కట్టడమైనను, లేక ప్రజలు ఎంతో యెక్కువ సంఖ్యలో ఆ యారాధనకు వచ్చినప్పటికిని, లేక ఆ బోధకుడు యెంత గొప్ప ప్రసంగికుడైనను మనము చేసే ఆరాధన మన హృదయముల నుండి చేయునది కాని యెడల అది అంతయు వ్యర్థము. అట్టి ఆరాధనకు ప్రాధాన్యత లేదు. అది దేవునికి అంగీకారము కాదు.

-- ఎస్. ఫిలిప్

❀❀❀❀❀


## క్రైస్తవ కీర్తనలు

237 పాటలు గల క్రైస్తవ కీర్తనలు పుస్తకం మరల ముద్రింపబడినది. దానిలో అనేక పాత, క్రొత్త కీర్తనలున్నవి. సత్యవాణిలో ప్రసారము చేయబడుచున్న కీర్తనలు కూడా యున్నవి. ఒక్కొక్క కాపీవెల 18 రూపాయలు. పోస్టేజీ 4 రూపాయలు అదనం. వలయువారు దిగువ చిరునామాకు M.O పంపండి. M.O దిగువ కూపను మీద మీ అడ్రసు తప్పక వ్రాయండి:

SATYA VANI, P.O.BOX-80, KAKINADA - 533 001.

సెయింట్ గూటం (గొల్లవిల్లి), వి. చిన్నయ్య (కడలి), జాషువా గూటం గార్లు వాక్యపరిచర్యలో పాల్గొనిరి.

యేసు ప్రభువు ప్రార్థనాపరులు. "ఆయన పెందలకడనే లేచి యింకను చాల చీకటి యుండగానే బయలు దేరి అరణ్యప్రదేశమునకు వెళ్లి అక్కడ ప్రార్థన చేయుచుండెను" (మార్కు 1:35). ఆయన శిష్యులు విసుగక నిత్యము ప్రార్థన చేయవలెనని ఆయన బోధించెను. ప్రార్థన ద్వారా మనం దేవుని స్తుతించాలి, ఘనపరచాలి, కృతజ్ఞత చెల్లించాలి, మరియు మన విన్నపములను ఆయనకు తెలియజేయాలి. పాతనిబంధనలో యాజకులు అర్పించిన ధూపద్రవ్యములు క్రీస్తు యుగంలో క్రైస్తవులు చేయు ప్రార్థనలకు సారూప్యముగా యున్నవి. ఆరాధనలో ప్రార్థనను దేవుడు ఒక భాగముగా యుంచెను. మరియు ప్రతి స్థలమందును పురుషులు పరిశుద్ధమైన చేతులెత్తి ప్రార్థించవలెనని ఆయన చిత్తమై యున్నది.

మనం ప్రార్థన చేయునప్పుడు వేషధారులవలె ప్రార్థించరాదు, మనుష్యుల చెవులకు ఇంపుగా యుండుటకై బహిరంగ ప్రార్థనలు చేయ రాదు, మరియు మనం ప్రార్థించునప్పుడు నిష్కపట హృదయంతో, మనః పూర్వకముగా, విరిగినలిగిన మనస్సు కలిగి ప్రార్థించిన యెడల అట్టిది దేవునికి ఇష్టపూర్వకమైన ప్రార్థన యగును. ఏలయనగా నీతిమంతుని ప్రార్థన మనఃపూర్వకమైనదై బహుబలముగలదై యుండును. మరియు మనం ప్రార్థన చేయునప్పుడు ఆయన చిత్తానుసారముగా యున్న సంగతుల నడుగవలెను. అప్పుడది అనుగ్రహించబడునని సోదరులు సవిస్తరముగా వివరించిరి. సోదరులు యన్.ఏలియా (దేవగుప్తం) గారి ప్రార్థనతో సదస్సు ముగిసెను. సోదరులు టి.వి.యన్. కుమార్ గారు, యోనా గారు, స్థానిక సంఘముతో కలిసి సదస్సుకు చక్కని ఏర్పాట్లు చేసి విజయవంతముగా జరిగించిరి.

2001 డిశంబరు 15వ తేదీ శనివారంనాడు రాజమండ్రి సంజీవ నగర్‌లోని క్రీస్తు సంఘ ఆవరణలో సువార్తికకుల సహవాస కూడిక సోదరులు యస్.జాన్ (బిక్కవోలు బైబిలు స్కూల్ డైరక్టర్) గారి అధ్వర్యములో ఘనముగా నిర్వహించబడెను. పలుప్రాంతముల నుండి వచ్చిన సువార్తికులతోను, బిక్కవోలు బైబిలు స్కూలు విద్యార్థులతోను బైబిలు స్టడీసెంటర్ కళకళ లాడెను. ఆ రోజు "సహోదరుల ఐక్యత" అను అంశము చర్చించబడెను.

సోదరులు ఓర్పు ఆదాము (నూజివీడు), యస్. విజయబాబు (గంటావారి గూడెం), యస్. డేవిడ్ కింగ్ (పాలచెర్ల), యమ్. ప్రభుదాస్ (ముంగండ), ఎ. వినయానంద్ (అనకాపల్లి), జాషువా గూటం (కాకినాడ), మరియు పి.యస్.ఆర్. జయపాల్ (ర్యాలి) గార్లు వాక్య పరిచర్య చేసిరి. సహోదరుల ఐక్యతలో గల సువాసనను, మాధుర్యాన్ని వివరించిరి. సోదరులు యస్. జాన్ గారు చక్కటి ఏర్పాటు చేసిరి. మంచి భోజన పానాదులు నేర్పాటు చేసిరి. సదస్సు జాషువా గారి ప్రార్థనతో ముగిసెను. తదనంతరం బిక్కవోలు బైబిలు స్కూల్ గ్రాడ్యుయేట్స్‌లో తొమ్మిది మందికి సువార్త నిమిత్తం సైకిళ్లను జాన్ గారు అందజేసిరి. హాజరైన వారందరు ఆనందభరింతులై తమ యిండ్లకు పయనమైరి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2001

From:
**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

**To**

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : JOSHUA GOOTAM.